★ దుర్విధి ★

మధుకర్

దుర్విధి కాకపోతే నేను వ్రాయబోయేదంతా జరిగిఉండదు. నిజంగా ఈ సంఘటన జరిగే ఉండకపోతే యిటువంటి విషయాన్ని విని నా చెవులను నేనే నమ్మలేకపోయుండేవాణ్ణి. ఇలాంటి విషయాలు, అసంభవాలు కాకపోయినా, చాల తరచుగా జరిగే విషయాలుమాత్రం కావని, నేను నొక్కి చెప్పగలను. ఇటువంటి విషయాల్ని నిజంగా మనం ఊహించనుగూడా లేము. జరిగిన విషయాన్ని విశదంగా వివరంగా వ్రాస్తున్నా.

ఇరుగు - పొరుగుల కథ యిది.

మా నివాసస్థలం ఒకచిన్న పట్టణం. ఆ పట్టణానికి ప్రత్యేకంగా ఒక ప్రాధాన్యత అంటూ ఏదీ లేదు. మనదేశంలోని అన్ని చిన్నచిన్న పట్టణాల్లాగే ఈ పట్టణంగూడా విశాలంగా గాని సమంగా గానీ లేని బాటలతో . మురికి కాలువలతో పురపాలక సంఘంలోని పోటీలతో స్వార్థపరులైన ఉద్యోగస్థులతో అలరారుతూంది

నా సంసారంలోని జనాభా ఎక్కువ అనే చెప్పాలి. నేను, ఆర్ధాంగి, మునలి తలిదండ్రులు, వేరేదిక్కులేని ఆత్తగారు, వీరికి తోడుగా దశరథుని సంతానమో అన్నట్టున్న నలుగురు మగపిల్లలూ! తాలూకా కచ్చేరీలో గుమాస్తాగిరీని వెలిగిస్తూన్న నాలాటి పేదబ్రాహ్మడికి, ఇంతకన్నా యింకేంకావాలి ?

ఇప్పుడు నా పొరుగింటి ఆయన్ని గురించి వినండి, ఆయన పేరు చాల తియ్యనిది మోహనరావు. పేరుకు కళంకం కలిగించకుండా మనిషి. గూడ అందగాడే! నాతోపాటే, ఆ తాలూకా కచ్చేరిలోనే ఆయనా పనిచేస్తున్నాడు, రావుగారి భార్య శ్రీలక్ష్మి.

మోహనరావులో ఉన్న చెడ్డగుణం ఒక్కటే. అందమయిన ఆడది అగుపడిందంటే కొన్ని క్షణాల పాటయినా ఆమెను రెప్పవాల్చకుండా చూడడమూ ఆ అందకత్తె కనుచూపునుండి దూరమై పోగానే ఆమె సౌందర్యానికి కారణాలయిన కొన్ని విశేషాంశాలయినా వర్ణించి చెప్పడమూ అతనికి అలవాటైపోయింది. దీనికి తోడుగా అతడొక చిన్నకవయితగూడ కావడం మంటలకు నెయ్యితోడయినట్టయింది. రెండునెలల క్రిందటనే రావుకు ఒక ఆడసంతానాన్ని ప్రసాదించిన శ్రీలక్ష్మి ఇంకాపుట్టినింటిలోనే ఉండడం అయనలోని ఈవ్యాధిని మరింత అధికం చేసింది.

నాకుతెలుసు: ఈ వ్యాధి చాల చెడ్డది, పైగా దినదినానికీ ముదిరిపోతూంది వ్యాధికి తగిన ముందును ఉపయోగిద్దామా అంటే మా యిద్దరి మధ్యా ఉన్న స్నేహం నాకింకా అంతటి స్వాతంత్ర్యాన్నివ్వలా పైగా సమవయస్కుడు. నా కన్నా రెండాకులు ఎక్కువగా చదువుకొన్న వాడూకూడ! అందువల్ల ఆయనచేపే పనుల్నీ, చెప్పేమాటల్నీ చూస్తూ వింటూ అవసరం కలిగినపుడు 'అహహ' అంటూ కాలాన్ని గడుపుతున్నా.

ఈ 'అహహ' అనడం నన్ను నిజంగా నమిలి మ్రింగేది. అహహా అంటూ అతగాణ్ణి ప్రోత్సహిస్తూన్నానేమోనన్న భయం ఒకవైపూ, అనకపోతే పరీక్షలోతప్పిపోయిన పెద్దబ్బాయిలాటి పాడుముఖం పెడతాడేమోనన్న దిగులొకవైపూ! పాడు భగవంతుడు! ఏది తెచ్చిపెట్టినా ఇలాంటి చిక్కునే మెడకు కడుతుంటాడు.

ఇలాగే రోజులు గడచిపోతున్నై. అయిదో నెల పూర్తికావిదే శ్రీలక్ష్మిని పంపడానికి వీలు

లేదని మోహనరావుగార్కి ఈరోజే ఉత్తర మొచ్చినట్టుంది.

ఇక ఇప్పుడు మరొక యింటిని గురించి, నా యింటికెదురుగా ఉంది అయిల్లు ఇల్లు భాగానే ఉంది. దానికి కారణాలు ఉన్నై. ఆకారణాల్లో అతి ముఖ్యమయింది— అద్దె, యిరవై అయిదు రూపాయలు కావడం. ఆ యింటికేమయినా ప్రత్యేకత ఉందా అంటే అదీలేదు. మహా ఉంటే ఆ యింటికి మా యింటికిలేని రెండు కిటికీలున్నై. జోరుగా వర్షమొచ్చిందంటే మేము రాత్రంతా మేలుకోవాల్సుంటుంది; అయింట్లో వుండదలచుకొన్న వారు ఒకమూల కాకపోతే మరొమూలనైనా తలదాచుకో డానికి వనతుంటుంది. అంతే భేదం, నిజంగా మరేగొప్ప విశేషమూలేదు.

ఆనాడు నేనూ - మోహనరావూ మా ఆఫీసు పని ముగించి వచ్చేసరికి ఆయింటిని ఎవరో అద్దెకు మాట్లాడు కోవడమూ ఇంటిని ప్రవేసించడమూ కూడ ముగించారు.

"సాయిబుగాడు కాదు గదా కొంప దీసి! నిజంగా సాయిబే అయితే చచ్చామన్న మాటే! రోజూ గొడ్డెలూ—మేకలూ....కోళ్లూ పందగలపూట ఆవులూ" అన్నాడు రావు.

"అబ్బే ... సాయిబు కాదు. చూడు; ఆ మామిడి తోరణాలు....ఇంటిముందు ముత్యాల ముగ్గూ ''

"కొంతవఱకూ బ్రతికాం. అయినా....మేకలూ కోళ్లూ తప్పవేమో ?''

"నిదానించవయ్యా బాబు! నీవు పెళ్లిపీటలు చూచుకో; రేపుదయాన్నే విషయాలన్నీ వివిపిస్తా వైట్లు"

మోహనరావు తలుపు తీసుకొని తన యింటి లోపలి వెళ్లిపోయాడు. ధర్మపత్ని ముట్టయిందన్న వార్తనందుకొంటూ రామ - భరత - లక్ష్మణ - శత్రుఘ్నుల ఏడ్పునే సంసారంలోని రాగసుధారసమనుకొని నన్నునేను సముదాయించుకొంటూ ఇంట్లో అడుగు పెట్టాను.

తెల్లవారే లోగానే ఎదురింటి వారి విషయాలన్నిటినీ తెలుసుకొన్నా.

ఆయన వ్యసాయ శాఖకు సంబంధించిన ఉద్యోగి. యువకుడు. బ్రాహ్మడే కాని, ప్రేమించి పెళ్లి చేసికొన్న ఆతని భార్యకారణంగా ఆతడు తలిదండ్రులకూ బంధువర్గానికీ దూరమైపోయాడు అందువల్ల ఆ యింట్లో వున్నదల్లా రెండు ప్రాణాలే. ఆయన పేరు జయరాముడు. అమ్మాయిపేరు అనూరాధ.

మోహన రావుకోసం కాచుకొని మాయింటి అరుగుమీద పేపర్లను నములుతూ కూర్చున్నా. రావు వచ్చాడు.

రావుకు రాత్రంతా నిద్రకూడా పట్టలేదో ఏమో "ఏంవ్యవహారం ఎంతవరకూ వచ్చింది?"అన్నాడు నన్ను చూచీచూడడంతోనే.

"ఆరచేతిలోని వైకుంఠం అందుకోడమెంత పేవండీ?" అంటూ వుండగానే ఇరవై ఏళ్ళకు మించని వయస్సులో ఉన్న ఒక అమ్మాయి ఎదురింటినుంచి బయటి కొచ్చిం. ఆమెచంకలో మెరుస్తూన్న ఒక రాగిబిందె ఉంది. మామూలుగా నడుచుకొంటూ కొళాయి వైపుకు వెళ్లి పోయిందా అమ్మాయి.

సౌందర్య రాసుల్లో చేర్చదగినయువతి అనూరాధ, మోహనరావు కళ్లింతవి చేసికొని చూస్తున్నాడు, ఆ అమ్మాయి సౌందర్యం అప్పుడే అయనగారి తలకెక్కినట్టుంది. అనూరాధ నడక లోని వయ్యారాన్ని గమనిస్తూన్నాడు రావు. అప్పుడే ఏదో గొణుగుతూగూడ ఉన్నాడాయన. కొంపదీసి కవిత్వం కాదుగదా?

అనూరాధ నిండు బిందెను చంకలో పెట్టుకొని మాపైపు నడచి వస్తూంది. తోపుగారి కవిత్వం కొంపముంచుతుందేమోనన్న భయంతోగడగడ వణికిపోతున్నా. మోహనరావు, మొదటి

తూరిగా తన భావోద్వేగాన్ని అణచుకొన్నాడు. అనూరాధ, తన యింటిని జేరుకొంది. నిమిషాలు గడచిపోతున్నై.

ఆఫీసుకు ప్రొద్దయింది. రేషనుబియ్యాన్ని మనసారా తిట్టుతూ, కాస్త కడుపునిండేలాగ తింటే దశరధుని సంతానానికి తక్కువవుతుందేమోనన్న సందేహంతో ఏదో గొణుగుతూ, ఆకుచుట్టూ పీక్లుచుట్టి, లేచాను. పిల్లలంతా ఊరక గోల చేస్తున్నారు.

"అమ్మమ్మా! పప్పు" అంటూన్నాడొకడు

"ఇంకొంచెం అన్నం" అంటూ మూలుగుతూన్నాడింకొకడు.

మిగిలిన యిద్దరూగూడ వాతావరణంలోని స్వారస్యాన్ని పోగొట్టకుండా తమతమ శక్తుల్ని వుపయోగించి ఏడ్పును నటిస్తూన్నారు.

ఆఫీసు కాగితాల్ని చంకలో బెట్టుకొని "ఏ విశ్వామిత్రుడిలాంటి వాడో వచ్చి యిద్దరిని తీసుకెళ్లితే కాస్త ఊపిరి పీల్చుకోడాని కయినా వీలుంటుంది" అని గొణుగుతూ బయటపడ్డాను.

ఎదురింటాయన ఎక్కడికో ప్రయాణమై బయలుదేరబోతూన్నాడు. అనూరాధ వాకిలివద్ద విలాసుని తియ్యగా మందహాసంచేస్తూ ఏవో చిలకపలుకుల్ని పలుకుతూ జయరామయ్యగారిని సాగనంపుతూంది. మా మోహనరావు ఈదృశ్యాన్ని రెప్పవాల్చకుండా చూస్తూన్నాడు.

విచారించిచూస్తే ఆయన తన కాఖకు సంబంధించిన వుద్యోగివి చూడడానికి ఆ జిల్లారాజధానికి వెళ్లుతున్నట్లు తెలిసింది. రావడానికి ఏ రెండు మూడు రోజులో కావచ్చు.

జయరామయ్య బయలుదేరాడు. నౌకరు ఆయన బెడ్డింగు మోసికొని ఆయననునుసరించాడు వెనక్కు తిరిగిచూచిన భర్తకు మరొక మందహాసాన్ని అనుగ్రహించి అనూరాధ తన యింటిలోవలికెళ్ళిపోయింది.

మోహనరావుకు ఆకస్మాత్తుగా తలనొప్పి వచ్చింది. రావు ఏవో దొంగవేషాల్ని వేస్తూన్నాడన్న విషయం నాకు తెల్సు. వీడివల్ల అమాయకురాలైన అనూరాధ చిక్కుల పాలవుతుందేమోనని నుకొన్నా. అనూరాధపైవి నాకెంతో జాలి కలిగింది, కాని మొగమెరుగని ఆమెకు మోహనరావును గురించి జాగ్రత్తగా వుండమని చెప్పడమెలా? రావుకు తెలియకుండా వాడితోపాటు వెలవుచీటీవ్రాసి వాని చేష్టల్ని గమనిస్తూన్నా.

చీకటి పడడానికి ఇంకా రెండుబారల ప్రొద్దుంది. అనూరాధ పరిశుభ్రమయిన దుస్తులతో త్రాచులాటి ఆమె జడలో వుంచుకొన్న పువ్వుల సువాసనలను అన్నివైపులకూ వ్యాపింపజేస్తూ నీళ్ళకని కొళాయికి బయలు దేరింది. మోహనరావు మా యింటి అరుగుమీదే పచార్లుచేస్తూ ఆమె సౌందర్యాన్ని ఆస్వాదిస్తూన్నాడు. వాని హృదయంలో యిమిడి వుండలేని కవిత్వం మెల్ల మెల్లగా బయటికి వస్తూంది. మోహనరావు ముఖభంగిమలను నేను దీక్షగా గమనిస్తూన్నా. రావు భావోద్వేగాన్ని ఆపుకోలేక పోతూన్నాడు. వింధువిందెను మోసికొని వస్తూన్న అనూరాధను చూచి రావు....

నినుచూచి నేనందు ఆనంద మింతనీ
తెలుపలేనే నేను త్రైలోక సుందరీ....

అని నలుగురికీ వినపడేలాగ అనేశాడు.

ఏ పాపమూ ఎరుగని అనూరాధ పీడిసీ.... వీడి చేష్టల్ని లెక్కచేసింది కాదు. తన యింటికి కావలా పడుకోడానికి సిద్ధంగావున్న ఇద్దరు నౌకర్లనూ పంపించేసింది— అనూరాధ.

చీకటి పడింది. మా భోజనాలు ముగిసినై. నలుగురు భేతాళులూ నాలుగువిధాలుగాపడి నిద్ర పోతున్నారు. తాలూకా కచ్చేరిలో గంటతరువాత గంటకొట్టుతున్నారు పదకొండయింది. నాకు నిద్దరరాలా. ఎక్కడ రవంత శబ్దమయినా ఎదురింటి వాకిలిని గమనిస్తూన్నా. ఒంటిగంటయింది, కనురెప్పలు బరువెక్కి వాటంతట అవే మూత

బడి పోతూనై. వున్నట్టుండి ఎదురింటి వాకిలి దభాలున మూసినశబ్దం వినపడింది. లేచి వెళ్దామనుకొన్నా, ధర్మపత్ని చీదరించింది నోరు నొక్కుకొని పడుకొన్నా. అయినా మనసంతా 'గుబులు గుబులు'గా వుంది....

మోహనరావు దొంగవేషాలు వేసి ఆయింటిని ప్రవేశించి వుంటాడు. ఆ అమ్మాయి ఈ పరిస్థితుల్లో వాణ్ణి చూచి హడలిపోయుంటుంది. తన నీచపుకోరికను మోహనరావు ఆమెకు తెలుపుతూంటాడు అనూరాధ రావుకు బుద్ధి జెప్పుతూంటుంది. బలవంతంగా అనూరాధను చెరచడానికి ప్రయత్నిస్తూంటాడు—రావు బంగారు తీగెలాంటి ఆమెశరీరం కందిపోయుంటుంది. పశుబలంతో అనూరాధను తన కౌగిల్లో బంధించి ఆమె పెదిమల్ని ముద్దుబెట్టుకోడానికి ప్రయత్నిస్తూంటాడు—రావు. వాని పశుబలానికి అనూరాధ లొంగిపోయుంటుంది. రావు తన కామతృష్ణను తీర్చుకొని బయటపడడానికి ప్రత్నిస్తూంటాడు దాపున్నే ఒకమూల వున్న గొడ్డలివి తీసుకొని అనూరాధ ఆడపులిలాగ రావుమీదపడి వాని తలను బద్దలుగా కొట్టివుంటుంది.....

"హా!" అన్న చావుకేక చాలస్పష్టంగా వినపడింది అది మోహనరావు స్వరమని నాకు బాగా తెలుసు ఏదో ఒకశక్తి నన్ను శక్తిలేని వాణ్ణిగా జేసింది. ఒకమైకం నన్నుముంచుకొచ్చింది. తెలివిదప్పి పడిపోయాను.

నాకు మరునటిదినం మధ్యాహ్నం మెలకువ కలిగింది. మంచంచుట్టూ నా సంసారమంతా వుంది యెదురింటినుండి రోదనధ్వని స్పష్టంగా వినపడుతూంది, నా చూపులటువైపే నిలిచినై.

"మోహనరావును చంపి తననూ చంపుకొంది—ఆ యిల్లాలు" అంది దూరంగా నిలుచున్న ధర్మపత్ని.

"దుర్విధి" అంటూ కొంత వరకూ మళ్లీ కళ్లు మూసుకొన్నా.

ఆనందవాణి

పోస్టుబాక్సు నెం. 1583

12, తంబుచెట్టి వీధి, మదరాసు

(ప్రచురణ : ప్రతి ఆదివారం)

సాలుచందా ... రు. 14/-

అర్ధసంవత్సర చందా రు. 7-8-0

(తపాలు వ్యయంతో సహా)

* అర్ధసంవత్సరముకంటె తక్కువకాలానికి చందా అంగీకరింపబడదు

* 'ఆనందవాణి' చందాదారులకు దీపావళి సంచిక ఉచితం

చందాదారులు

మాతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు వారి చందాదారు నంబరు తప్పక తెలుపవలెను. లేకుంటేజవాబులు ఆలస్యమవుతుంది. మనియార్డర్లు మొ॥ వాటిని ఆనందవాణి ఆఫీసు, 12 తంబుచెట్టివీధి, జి.టి. మద్రాసు" అనే చిరునామాకు వ్రాయవలెను. వ్యక్తులపేర పంపవద్దు.

—మేనేజరు